సాక్షి గుంటూరు

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



యాగశాలలో విశేష చండీహోమం

ఫిరంగిపురం: స్థానిక విజయదుర్గామాత వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం చండీహోమం నిర్వహించారు. దుర్గామాత ఉత్సవమూర్తిని ఊరేగించారు.



పంచాగం ఆవిష్కరణ

నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయంలో శ్రీక్రోధి నామ సంవత్సర తెలుగు పంచాంగాలను ఆదివారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆవిష్కరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
నరసరావుపేట	6.29	4.42
గుంటూరు	6.27	4.40
బాపట్ల	6.27	4.40

న్యూస్‌రీల్

పరమపరనాథుడుగా నారసింహుడు



మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వారు ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా ఆదివారం పరమపరనాథుడుగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా అన్నమాచార్య ఆరాధన ఉత్సవాలు



తెనాలిటౌన్: కొత్తపేటలోని రామకృష్ణకవి కళా క్షేత్రంలో తాళ్లపాక అన్నమాచార్య ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించారు. తొలుతగా వేంకటేశ్వరస్వామికి అర్చన, హారతి ఇచ్చారు. అన్నమాచార్యుల చరిత్ర గురించి లక్కరాజు కనకదుర్గ వివరించారు. పొత్తూరి వెంకట ఆదిలక్ష్మి బృందం, జి.ఆంజనేయశాస్త్రి, కొండపి వసుంధర బృందం, నేరెళ్ల కల్యాణి బృందం, వి.లక్ష్మీసునీత, మాదాల గార్గి బృందం, ఎస్.శైలజ బృందం, కె.బాలత్రిపుర సుందరి బృందం సభ్యులు కలిపి 150 మంది గాయకులు సంకీర్తన యజ్ఞంలో పాల్గొన్నారు. ప్రజలు, కళాకారులు, గాయకులు విశేషంగా పాల్గొని అన్నమాచార్య సంకీర్తనలను తిలకించారు. కార్యక్రమాన్ని వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అందె బాలచంద్రమౌళి, ఎస్.కేశవరావు, డాక్టర్ పురుషోత్తమరావు, పరుచూరి సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు నాక్ మాక్ కమిటీ సందర్శన


ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ఏర్పాట్లలో నాక్ పీర్ టీమ్ సోమవారం విభాగాలను సందర్శిస్తుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ తెలిపారు. ఈ మేరకు అన్ని విభాగాలు ఉదయం 9గంటలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ముందస్తు కమిటీ పర్యటన వివరాలు విభాగాధిపతులకు పంపినట్లు తెలిపారు. కమిటీకి తగు సమాచారం ఇవ్వాలని సూచించారు. వర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ కె. వి.రావు, జేఎన్టీయూ కే వర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ వీవీఎస్ కుమార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.మోహన్‌రావు, యోగి వేమన వర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ ఏ.రామచంద్రారెడ్డిలతోపాటు వర్సిటీ అధికారులు, విభాగాలను పరిశీలిస్తారని తెలిపారు. ప్రతీ విభాగం సిద్ధంగా ఉండాలని సూచించారు.

వాహనాల తనిఖీ



తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో తెనాలి మార్కెట్ వంతెన వద్ద ఆదివారం రాత్రి వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు, త్రీ టౌన్ ఎస్ఐ నక్కా ప్రకాశరావు, సీఐఎస్ఎఫ్ బలగాలు అన్ని వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, ఆభరణాలను ప్రజలు తీసుకెళ్లకూడదని పోలీసులు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 511.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 810.00 అడుగుల వద్ద ఉంది.

జననేత జైత్రయాత్రకు సిద్ధం!

పల్నాడుకు ఒక రోజు ముందే ఉగాది ఉషస్సులు రానున్నాయి. సంక్షేమ సారథి, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సాయంత్రం జిల్లాలో అడుగిడనున్నారు. విశ్వసనీయతకు ప్రతీకగా.. ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఆశీర్వదించమని కోరేందుకు.. మంచి జరిగితేనే ఓటు వేయాలని లక్షలాది కుటుంబాలను స్వయంగా కలిసి అడిగేందుకు జగనన్న వస్తున్నారు.. జయహో జగనన్న అంటూ ఆయన రాక కోసం కళ్లలో ఒత్తులేసుకుని ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా... తమ అభిమాన నేతను ఎప్పుడు చూస్తామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

- నేడు సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర జిల్లాలోకి ప్రవేశం
- జననేతకు స్వాగతం పలికేందుకు యాత్ర సాగే దారిలో ప్రతి పల్లె సిద్ధం
- నేడు వినుకొండ పట్టణంలో రోడ్డు షో
- గంటావారిపాలెంలో రాత్రి బస
- ఇక్కడే ఉగాది ఉత్సవాలు రేపు
- ఆత్రుతగా ఎదురుచూస్తున్న పల్నాడు ప్రజలు



మేమంతా సిద్ధం బస్సు యాత్ర స్వాగత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే బొల్లా

సాక్షి, నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు పల్నాడు జిల్లా ముస్తాబయింది. బస్సు యాత్రకు సోమవారం సాయంత్రం ప్రకాశం జిల్లా సరిహద్దుల నుంచి పల్నాడు జిల్లాలో ప్రవేశనుంది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభల పేరిట ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా నాలుగు సభలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ప్రజలకు చేసిన మేలును వివరించడంతో పాటు ప్రజల కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాల మూకుమ్మడి కుట్రలను వివరించారు. ఆ సభలో చరిత్రలో నిలిచేలా విజయవంతమైన విషయం తెలిసిందే. అదే ఉత్సాహంతో మేమంతా సిద్ధం పేరిట ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా బస్సు యాత్ర చేపట్టారు. ఆయన రాకకోసం పార్టీ శ్రేణులు, అభిమానులు, లక్షలాది మంది ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆదివారం ఉదయం వెంకటాచలంపల్లి రాత్రి బస నుంచి బయలుదేరిన సీఎం బొదనంపాడు, కురిచేడు మీదుగా పల్నాడు జిల్లాలోని చింతల చెరువు మీదుగా జిల్లాలోకి ప్రవేశించనున్నారు. సుమారు 42 కిలోమీటర్ల మేర సోమవారం బస్సు యాత్ర సాగనుంది.

గంటావారిపాలెంలో..

మేమంతా సిద్ధం బస్సు యాత్ర చింతలచెరువు నుంచి పాదిలి జంక్షన్, చీకటిగలపాలెం మీదుగా వినుకొండ పట్టణానికి చేరుకోనుంది. పట్టణంలో వేలాది మంది అభిమానులకు అభివాదం చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు షో నిర్వహించనున్నారు. వినుకొండలో యాత్ర ముగిసిన తరువాత కనమర్లపుడి, శావల్యాపురం మీదుగా గంటావారిపాలేనికి బస్సుయాత్ర చేరుకోనుంది. అక్కడే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాత్రి బస చేయనున్నారు. అక్కడ అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పల్నాడు ఎస్పీ బిందుమాధవ్ బస్సుయాత్ర జరిగే ప్రదేశాలను పరిశీలించి సీఎం భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు.

ఎదురుచూస్తున్న అభిమానులు...

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారానికి రావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం కనిపిస్తోంది. గత ఎన్నికల్లో పల్నాడు జిల్లా ఏడు అసెంబ్లీ స్థానాల్లో క్లీన్‌స్వీప్ చేసి నరసరావుపేట లోక్‌సభను కైవసం చేసుకుంది. ఐదేళ్ల సంక్షేమ, అభివృద్ధి పాలన చూసిన ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. అటువంటి సమయంలో జననేత చేస్తున్న బస్సుయాత్ర జిల్లాలోకి ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. వైఎస్ జగన్ బస్సు యాత్ర జరిగే దారి మార్గంలో స్వాగతం పలికేందుకు ప్రతి పల్లె, పట్టణంలో అభిమానులు సిద్ధంగా ఉన్నారు. తమ అభిమాన నేతను ఒకసారి చూడాలని వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు.

క్షుణ్ణంగా తనిఖీ

శావల్యాపురం: పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం గ్రామ జాతీయ రహదారి వెంబడి 15 ఎకరాల పొలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస చేసే ఏరియాను బాంబు స్క్వాడ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు ఆదివారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస చేసే ఏరియాలో పటిష్టమైన పోలీసు బందోబస్తుతో పాటు డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ డిటెక్టర్లు ద్వారా విస్తృత స్థాయిలో పోలీసు అధికారులు తనిఖీలు చేశారు.



సీఎం వైఎస్ జగన్ బస చేసే ఏరియాలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పల్నాడు సిద్ధం...



పల్నాడు జిల్లాలో జరిగే మేమంతా సిద్ధం యాత్ర, పిడుగురాళ్లలో నిర్వహించనున్న బహిరంగ సభలలో లక్షలాది మంది పాల్గొని విజయవంతం చేయాలి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల నేపథ్యంలో ప్రజలను, కార్యకర్తలను చైతన్యపర్చేందుకు నిర్వహిస్తున్న బస్సు యాత్ర ద్వారా వస్తున్న స్పందన చూసి ప్రతిపక్షాలకు కాళ్లుచేతులు ఆడటం లేదు. సీఎం జగన్ బస్సుయాత్రకు మహిళలు, యువకులు, రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా రావడానికి సిద్ధంగా ఉన్నారు.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పల్నాడు జిల్లా

బస్సు యాత్రకు పటిష్ట భద్రత

జిల్లా ఎస్పీ బిందుమాధవ్



వినుకొండ(నూజెండ్ల)/శావల్యాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు ముఖ్యమంత్రి బస్సు యాత్ర ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రకాశం జిల్లా సరిహద్దు ప్రాంతం చింతల చెరువు నుంచి నుంచి ముఖ్యమంత్రి బస చేయనున్న గంటావారిపాలెం వరకు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సీఎం సభకు పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

గంటావారిపాలెంలో ఉగాది ఉత్సవాలు..

గ్రామంలో ఉగాది సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హాజరవుతారు. ఉగాది సంబరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా వేదపండితులు సారథ్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

‘మేమంతా సిద్ధం’ సభను విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి

నూజెండ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సీఎం హాజరుకానున్న యాత్ర రూట్‌ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డితో కలసి పరిశీలించారు. నూజెండ్ల మండలం చింతలచెరువు వద్ద ప్రకాశం జిల్లా నుంచి పల్నాడు జిల్లాలో యాత్ర ప్రవేశించే ప్రదేశంలో స్వాగత ఏర్పాట్లు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తలపెట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కానున్నారని ధీమా వ్యక్తం చేశారు. వినుకొండలో నిర్వహించనున్న రోడ్ షోలో వేలాది మంది కార్యకర్తలు ఘనస్వాగతం పలికి విజయవంతం చేయాలన్నారు. దేశం, రాష్ట్రంలో నిర్వహించిన అనేక సర్వేలు వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారని చెబుతున్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మేమంతా సిద్ధం బస్సు యాత్రను నియోజకవర్గ ప్రజలందరూ వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రతిపక్షాలు అర్థం లేని విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పార్టీలో ప్రజలందరూ సమష్టిగా మేమంతా సిద్ధంను విజయవంతం చేయాలని కోరారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

- వ్యాపారుల జోలికి ఎవరు వచ్చినా ఊరుకునే ప్రసక్తేలేదు
- చిలకలూరిపేటలో ఏ ఒక్క రోజు ఒక్క వ్యాపారిని మేం ఇబ్బంది పెట్టలేదు
- ఆర్యవైశ్యులే ఆర్థిక వ్యవస్థకు పునాది
- వైఎస్సార్ సీపీలో ఎంతో ప్రాధాన్యం
- మరోసారి గెలిపిస్తే జగనన్న మీకు తోడుగా ఉంటారు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం
- హాజరైన రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, కిలారి వెంకటరోశయ్య



మాట్లాడుతున్న మంత్రి రజిని, వేదికపై ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యేలు కిలారి, మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: తనను ఆదరించి ముందుకు నడిపిస్తే.. అందరికీ అండగా ఉండి కష్టనష్టాల్లో తోడుగా ఉంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. గుంటూరు రింగ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షతన నిర్వహించారు. మంత్రి రజిని మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఆర్థిక వ్యవస్థకు పునాది రాళ్లు వంటి వారని తెలిపారు. నిజాయితీ, విశ్వసనీయతతో వ్యాపారం చేస్తున్నారని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మా గాంధీ ముందుండి నడిపించి జాతిపితగా ఖ్యాతి గడిరచారని, మన రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని.. అలాంటి మహనీయులు ఆర్యవైశ్యులకే కాదని, మన దేశం, రాష్ట్రానికే మణిరత్నాలు అని కొనియాడారు.

ప్రశాంతత, స్వేచ్ఛ లక్ష్యం

ప్రతి వ్యాపారి స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునేలా చూడటమే తమ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ ఐదేళ్లలో ఎక్కడా ఏ వ్యాపారి కూడా ప్రభుత్వ వేధింపులకు గురి కాలేదని చెప్పారు. చిలకలూరిపేటలో తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశానని, ఎక్కడా, ఎవరినీ తాము ఇబ్బంది పెట్టిందే లేదని తెలిపారు. స్వేచ్ఛగా వ్యాపారాలు జరగలేని పరిస్థితి ఉంటే సమాజం ముందుకు సాగదని చెప్పారు. సంపాదించుకోవడానికి తాము రాజకీయాల్లో రాలేదని వెల్లడించారు. ప్రజాసేవే లక్ష్యంగా, చదువుకున్న వారిగా తాము రాజకీయాల్లోకి వచ్చామని పేర్కొన్నారు. వ్యాపారుల జోలికి ఎవరొచ్చినా ఊరుకునే ప్రసక్తే ఉండదని తెలిపారు. గుంటూరు నగరంలో ప్రశాంత వాతావరణాన్ని వచ్చే ఐదేళ్లలో మీరే చూస్తారని హామీ ఇచ్చారు.

పేద కుటుంబాలకు ఎంతో చేశాం..

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు పథకాల ద్వారా పేద ఆర్యవైశ్యులందరూ జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొందుతున్నారని, అలాగే అగ్రవర్ణ పేద కుటుంబాల విద్యార్థులకు ప్రైవేటు యూనివర్సిటీలలో 25 శాతం రిజర్వేషన్ ఇస్తూ జగనన్న జారీ చేసిన జీఓ ద్వారా కూడా ఎంతో మంది విద్యార్థులు లబ్ధి పొందారని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఆర్యవైశ్యులంతా వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

రజిని, రోశయ్యను గెలిపించండి: ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

సమావేశానికి అధ్యక్షత వహించిన పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని తెలిపారు. కరోనా సమయంలో వలంటీర్ల ద్వారా చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. పేదల కోసం జగనన్న పడుతున్న తపన ఎంతో గొప్పదని కొనియాడారు. గత ఎన్నికలలో ఇదే నియోజకవర్గం నుంచి అందరి ఆశీస్సులతో తాను గెలుపొందానని, అదేవిధంగా ఈసారి విడదల రజిని, ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్యకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

జగన్‌ను మించిన నాయకులు రాలేరు: ఎంపీ అభ్యర్థి కిలారి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మించిన నాయకులు ఈ రాష్ట్రంలో ఎప్పటికీ రాలేరని పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత రాజధాని పేరుతో గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కాని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని చూడలేకనే ఆయనపై దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) మాట్లాడుతూ ఆర్యవైశ్యులు మంచి చేసేవారికి ఎప్పుడూ తోడుగా ఉంటారని తెలిపారు. గొప్ప పరిపాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు.

మంచి చేసే వారిని ఎన్నుకోవాలి

- ఐదేళ్లల్లో ఎన్నో అద్భుతాలు సృష్టించాం
- కూటమి మాయమాటలు నమ్మొద్దు
- బాపట్ల ఎంపీ సురేష్, అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి చిన హనిమిరెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్, అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

జే పంగులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలించిన ఐదేళ్లలో ఎన్నో అద్భుతాలు సృష్టించామని బాపట్ల ఎంపీ నందిగం సురేష్, అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న నాయకత్వంలో ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను, అంతకు ముందు చంద్రబాబు పాలనను బేరీజు వేసుకుని ఎవరి వల్ల మంచి జరిగిందో ఆలోచించాలన్నారు. ఏ ప్రభుత్వ హయాంలో మీ కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయో గమనించాలని చెప్పారు. మంచి చేసే మనసున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో మీకు మేలు జరిగిందంటే ఆయనకు ఓటేసి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

కూటమి నేతల కుట్రలతోనే ఇబ్బందులు..

లబ్ధిదారులు ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ అడ్డుకున్న ద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. పేదలకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా చేస్తున్న మేలును చూసి ఓర్వలేని చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూటమి నాయకులు కుట్రపన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారన్నారు. ఇది తాత్కాలికమేనని, మళ్లీ జగనన్న ప్రభుత్వం రాగానే వలంటీర్లు వేకువజామునే ఇంటికి వచ్చి పింఛన్లు ఇస్తారని చెప్పారు. సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పెత్తందార్లపై పేదలదే విజయం..


రానున్న ఎన్నికల్లో కూటమి పక్షాన పోటీలో నిలబడిన కోటీశ్వరులైన అయిన పెత్తందార్లపై సీఎం జగనన్న నిలబెట్టిన తనవంటి సామాన్యులదే విజయమని అన్నారు. రానున్న ఎన్నికల యుద్ధంలో జగనన్న పాటిస్తున్న ధర్మమే గెలుస్తుందని, చంద్రబాబు కూటమి సమాధికాక తప్పదని చెప్పారు. చంద్రబాబు నాపై ఎన్ని కేసులు పెట్టినా, ఒక సామాన్య వ్యక్తిని ఎంపీ చేసిన ఘనత మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని సురేష్ అన్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరాతీశారు. పింఛన్ అందించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి సమస్య లేదని, ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారుజామునే తలుపు తట్టి పింఛన్ అందించే వలంటీరుని చంద్రబాబు అండ్‌కో అడ్డుకోవడం వలన ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని వృద్ధులు, వికలాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, మాజీ ఏఎంసీ చైర్మన్ జంపాని రవిబాబు, సర్పంచి చొప్పరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై ‘వేసవి’ ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై భక్తులు ఇబ్బంది పడకుండా ‘వేసవి’ ఏర్పాట్లు చేశారు. మూడు రోజులుగా నగరంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరడంతో ఆలయ పరిసరాల్లో చేపట్టిన ఏర్పాట్లు సత్ఫలితాలనిచ్చాయి. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో మజ్జిగ వితరణ చేశారు. ఆదివారం మజ్జిగ పంపిణీని దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం, మహామండపం, కళావేదిక, లక్ష్మీ గణపతి ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులు రావిచెట్టు, ధర్మపథం వేదిక వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద సేద తీరుతున్నారు. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్, లక్ష్మీ గణపతి ప్రాంగణం, స్కానింగ్ పాయింట్, మల్లేశ్వరస్వామి ఆలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తుల నడక మార్గాల్లో కూల్ పెయింట్ వేసిన సంగతి తెలిసిందే.

మళ్లీ అభ్యర్థులను మార్చడానికి వెనుకాడబోను

- చంద్రబాబు హెచ్చరిక
- గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమీక్ష



సత్తెనపల్లి: బి.ఫారాలు ఇచ్చే వరకు ఎప్పటికప్పుడు సర్వేలు పరిశీలించి అవసరమైతే అభ్యర్థులను మార్చటానికి కూడా వెనుకాడబోనని టీడీపీ అధినేత చంద్రబాబు అభ్యర్థులను హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లి వచ్చిన ఆయన రఘురాం నగర్‌లోని వెంకటేశ్వర కల్యాణ మండపం వద్ద బస చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమీక్ష చేశారు. పార్టీ వర్గాల ద్వారా తెలిసిన సమాచారం మేరకు... ఒంటెద్దు పోకడలు పోవద్దని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఒక్కొక్క అభ్యర్థితో ఏకాంతంగా మాట్లాడినట్లు సమాచారం. పనితీరు మార్చుకోవాలని కొందరికి తీవ్ర హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుతో ఆయా పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థుల పనితీరు, గెలుపు అవకాశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగతో మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. టీడీపీకి చెందిన న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. అసమ్మతి గళం వినిపిస్తున్న పలువురు నాయకులతో సమావేశమయ్యారు. పలువురు పొరుగు జిల్లాల నేతలు చంద్రబాబును కలిశారు. కొందరికి పార్టీ కండువాలు వేసి చేర్చుకున్నారు. సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని రఘురాంనగర్‌లోని శాంతినికేతన్ జూనియర్ కళాశాల ఆవరణలో హెలికాప్టర్‌లో తిరుగు పయనమయ్యారు.

క్లుప్తంగా

మిలటరీ విశ్రాంత ఉద్యోగులకు క్యాష్ లెస్ కింద కీళ్ల మార్పిడి



డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: మిలటరీ విశ్రాంత ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు క్యాష్ లెస్ కింద కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, గుంటూరు సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిలటరీ విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలు అందించేందుకు సంబంధిత శాఖ నుంచి అనుమతులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. దేశ రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలు అందించే అవకాశం తమకు రావడం మహాభాగ్యమని పేర్కొన్నారు. ఖరీదైన మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్‌లను క్యాష్ లెస్ కింద అందించే ఈ అవకాశాన్ని మిలటరీ విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నరేంద్ర రెడ్డి సూచించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన చిన అంజయ్య

మేదరమెట్ల: భార్య ఇంటికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం పమిడిపాడులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన అత్తింటి చిన అంజయ్య (58) భార్య కొంతకాలం క్రితం పుట్టింటికి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో పలుమార్లు వెళ్లి అంజయ్య పిలిచాడు. భార్య ఇంటికి రాకపోవడంతో అతను మనస్తాపానికి గురయ్యాడు. సాయంత్రం తన తల్లి బయటకు వెళ్లగానే.. ఇంటిలోని స్లాబు హుక్కుకు ఉరివేసుకున్నాడు. మృతుడి తల్లి తిరిగి వచ్చిన తర్వాత అది గమనించి, చిన అంజయ్యను స్థానికుల సాయంతో కిందకు దించింది. అప్పటికే అతను మృతి చెందడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో కొరిశపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లావణ్యకే చేనేతల అండ

- తీర్మానం చేసిన పద్మశాలీయ సంఘాలు
- మన అమ్మాయి..మన లావణ్య గెలుపే లక్ష్యమన్న ప్రతినిధులు
- హాజరైన ఎమ్మెల్సీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల
- నగరంలోని పద్మశాలీయ సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు. వేదికపై మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్య, పద్మశాలీయ సంఘాల ప్రతినిధులు

మంగళగిరి: మంగళగిరి అసెంబ్లీ సీటును చేనేత సామాజికవర్గానికి చెందిన మురుగుడు లావణ్యకు వైఎస్సార్ సీపీ కేటాయించి రాజకీయంగా సముచిత స్థానం కల్పించిన నేపథ్యంలో ఆమెకు అంతా అండగా నిలవాలని సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. పట్టణంలోని వడ్లపూడి సెంటర్‌లో గల మార్కేండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం నగరంలో పద్మశాలీయ సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే కాండ్రు కమల వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత సామాజికవర్గానికి రాజకీయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. బీసీ మహిళ లావణ్యను వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నిలబెట్టిన నేపథ్యంలో చేనేత సామాజిక వర్గం అంతా అండగా ఉండి గెలిపించాలని కోరారు. చేనేత సామాజికవర్గంలో ఉన్న పద్మశాలీయ సంఘాలన్నీ ఐక్యంగా లావణ్య, వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో బలమైన ఓటు బ్యాంకు ఉన్న చేనేత సామాజికవర్గం తనకు అక్కర్లేదని చంద్రబాబు రాష్ట్రంలో ఒక్క సీటు కేటాయించలేదని విమర్శించారు. లావణ్యను వైఎస్సార్ సీపీని గెలిపించి సామాజికవర్గ సత్తా చాటాలని తెలిపారు. పద్మశాలీయ సంఘాలన్నీ లావణ్య విజయానికి కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించాయి. పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ చేనేత సామాజికవర్గానికి దక్కిన అవకాశాన్ని వినియోగించుకుని చట్టసభలకు ప్రతినిధులను పంపేలా సాకృషి చేయాలని పిలుపునిచ్చారు. లావణ్యను గెలిపించి, లోకేష్‌ను ఓడించి చంద్రబాబుకు తమ సామాజికవర్గ సత్తా ఏమిటో చూపే అవకాశం వచ్చిందని తెలిపారు. ఆయా సంఘాల పరిధిలోని చేనేత సామాజికవర్గ ప్రజలను చైతన్యపరచి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం, పాత మంగళగిరి పద్మశాలీయ సంఘం, పాత మంగళగిరి కల్యాణ మండపం సంఘం, రత్నాలచెరువు పద్మశాలీయ సంఘం, నగర పరిధిలోని నిడమర్రు, కాజ, చినకాకాని, యర్రబాలెం, నులకపేట,తాడేపల్లి, గుంటూరు, కృష్ణా జిల్లాల సంఘాలు, పద్మశాలీయ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్, మాస్టర్ వీవర్స్ అసోషియేషన్, సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్, మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ, రాష్ట్రంలోని పలు ప్రాంతాల పద్మశాలీయ సంఘాల ప్రతినిధుల హాజరయ్యారు. పట్టణ పద్మశాలీయ బహుత్తమ అధ్యక్షుడు దామర్ల కుబేరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు కన్నా మాస్టార్, చింతకింది కనకయ్య, జొన్నాదుల మణి,వూట్ల సాంబశివరావు, ప్రగడ రాజశేఖర్, పాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి మూల్యాంకం

డీఈఓ వెంకటేశ్వర్లు



డీఈఓ వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయులు, సంఘాల సహకారంతో పదో తరగతి మూల్యాంకనాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని సెయింటాన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి మూల్యాంకనం ముగింపు సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆయన్ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాలు, సూచనలు అమలు చేస్తూ ఉపాధ్యాయుల సహకారంతో స్పాట్ క్యాంప్‌ను పొరపాట్లకు తావివ్వకుండా విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. దాదాపు 1100 మంది ఉపాధ్యాయులు పాల్గొని 1,80,775 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారని వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులకు అదనపు వసతులు కల్పించామని తెలిపారు. క్యాంప్ ఆవరణలో మెడికల్ సిబ్బందితో పాటు 108 అంబులెన్స్ ఏర్పాటు వంటి ముందు జాగ్రత్తలు తీసుకొన్నట్టు వివరించారు. అనారోగ్య సమస్యలు ఉన్న ఉపాధ్యాయులకు మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇచ్చామని తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటితో పాటు చల్లటి మజ్జిగ అందించామని చెప్పారు. ఇదే సహకారాన్ని పాఠశాలల నిర్వహణలోనూ అందివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వేణు గోపాలరావు, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కేఎంఏ హుస్సేన్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిషత్‌లే నాటకరంగ నిలయాలకు పునాదులు



నటరాజ పూజ చేస్తున్న డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తదితరులు



కొత్తతరం కొడుకు నాటికలోని ఓ సన్నివేశం

- డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు
- లింగారావుపాలెంలో జాతీయస్థాయి నాటికల పోటీలు ప్రారంభం
- కొండవీడు కళాపరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవ పరిషత్ నిర్వహణ
- తొలిరోజు మూడు నాటికల ప్రదర్శన

యడ్లపాడు: పరిషత్‌లే నాటకరంగ నిలయాలకు పునాదులని డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు చెప్పారు. మండలంలోని లింగారావుపాలెంలో కొండవీడు కళాపరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవ పరిషత్ సంయుక్తంగా నిర్వహించే జాతీయ స్థాయి నాటికల పోటీలు ఆదివారం మొదలయ్యాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు జ్యోతి ప్రజ్వలన, మల్నేని సుబ్బారావు నటరాజ పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటికల ప్రదర్శనలు మొదటి రెండు రోజులు లింగారావుపాలెంలోనూ.. తదుపరి రెండు రోజులు యడ్లపాడులో ప్రదర్శితం అవుతాయని తెలిపారు. మండేఎండల్లోనూ..ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అధికారుల అనుమతితో నిర్వహిస్తున్న ఈ నాటికల ప్రదర్శనలను ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ కార్యవర్గం కట్టా శ్రీహరిరావు, తోకల సాంబశివరావు, కట్టా వీరాంజనేయులు, మల్నేని సీతారామయ్య, నంబూరి వీరాంజనేయులు, మండెపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధ్యతలు గుర్తు చేసిన 'కొత్తతరం కొడుకు'

తల్లిదండ్రులు, పిల్లల బాధ్యతను 'కొత్తతరం కొడుకు' నాటిక తెలిపింది. పిల్లల్ని ప్రేమగా పెంచడం, పోషించడం తల్లిదండ్రుల బాధ్యత. పెరిగి పెద్దయ్యాకా తల్లిదండ్రుల్ని చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదే అనే విషయాన్ని మరువకూడదన్న సందేశాన్ని వినూత్న తరహాలో చూపిన 'కొత్తతరం కొడుకు' నాటిక కథాంశం ఆకట్టుకుంది. వయసు మీద పడిన తల్లిదండ్రులు కాస్త కష్టమైనా తమ పిల్లల్ని దగ్గరే ఉండాలన్న సందేశం అందరినీ ఆలోచింపజేసింది. రావు కృష్ణారావు మూలకథకు చెలికాని వెంకట్రావు నాటకీకరణ, దర్శకత్వం వహించిన ఈ నాటికను మణికంఠ ఆర్ట్స్ (పిఠాపురం) వారు ప్రదర్శించారు.

ఆలోచింపచేసిన 'నిశబ్దమా..నీ ఖరీదెంత' ?

కుటుంబ వ్యవస్థను సంస్కరించే దిశగా చట్టంలో చేసిన ఓ మార్పుతో వ్యవస్థ సంగతి అటుంచితే ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఆయా కుటుంబాల్లోని కొందరు వ్యక్తులు మానసికంగా నలుగుతూ..కుంగిపోతున్నారనే అంశాన్ని కళ్లకు చూపెట్టిన కథే 'నిశ్శబ్దమా..నీ ఖరీదెంత' ? నాటిక. పీటీ మాధవ్ రచనకు చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వం వహించారు. తెలుగు కళాసమితి (విశాఖపట్నం) వారు ప్రదర్శించిన ఈ నాటికలో 498/ఏ ఐపీఎస్ చట్టాన్ని కొందరు అతివలు దుర్వినియోగం కారణంగా కుటుంబాల్లో రగులుతున్న చిచ్చు, కక్షసాధింపు చర్యలు, విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు ప్రస్తుత పరిస్థితిని అద్దం పట్టింది. అక్రమ సంబంధం నేరంకాదని సెక్షన్ 497 ఐపీఎస్ నుంచి తొలగించడం వల్ల కుటుంబ వ్యవస్థ, నైతికత పతనమవుతున్న వైనాన్ని అద్భుతంగా చూపింది.

బంధాల విలువల్ని తెలిపిన 'అమృత హస్తం'

బంధాల విలువల్ని సమాజానికి 'అమృత హస్తం'' నాటిక తెలిపింది. సమాజంలో నానాటికి మృగ్యమైపోతున్న బంధాలు.. వాటి విలువలను చాటిచెప్పేదే 'అమృతహస్తం' నాటిక. ఒకే తల్లి గర్భాన జన్మించిన అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధం, దాని గొప్పతనాన్ని నేటి సమాజానికి తెలియజేయడం ఎంత అవసరమో అనే స్ఫూర్తిని నాటిక కలిగిస్తుంది. కావూరి సత్యనారాయణ రచనకు ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. అమరావతి ఆర్ట్స్ (గుంటూరు) సమర్పించిన ఈ నాటిక ప్రేక్షక మనసుల్ని బంధంలా పెనవేసుకుంది.

'మేమంతా సిద్ధం' సభను జయప్రదం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నర్సరావుపేట పార్లమెంట్ పరిశీలకులు రేపాల

నర్సరావుపేట పార్లమెంట్ పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: 'మేమంతా సిద్ధం' సభను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని నర్సరావుపేట పార్లమెంట్ పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణ శివారులోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలను అందించారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కోడూరి ప్రసాద్, కౌన్సిలర్లు కన్నయ్య, బాలస్వామి, అనిల్‌కుమార్, నియోజకవర్గ వాణిజ్య విభాగం సెక్రటరీ మద్దు నరేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంటచింతల కాదు మంటచింతల

- భగభగమంటున్న భానుడు
- 44.3 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రత



రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల్లో వేసవిలో మంటచింతలగా పేరొందిన రెంటచింతల ఏప్రిల్ రెండో వారంలోనే భగభగమండుతోంది. ఏ రోజు ఎండ ఎక్కువ కాసినా రెంటచింతల ఉష్ణోగ్రత ఎంత అని అడగడం సహజం. ఈ ప్రాంతంలో నాపరాయి నిక్షేపాలు ఎక్కువగా ఉండటం కారణంగానే ఉష్ణోగ్రత అధికంగా నమోదు అవుతుంది. ఆదివారం గ్రామంలో గరిష్ట ఉష్ణోగ్రత 44.3 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 26.6 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా నాలుగు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో గ్రామస్తులు అల్లాడుతున్నారు. భానుడు నిప్పులు కురిపిస్తుండటంతో ఇంట్లోంచి బయటకు రాలేకపోతున్నారు. ఉక్కపోతకు తట్టుకోలేక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలింతలు, చిన్నారులు, గర్భిణులు అవస్థలకు గురవుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే ఆరుబయటకు రావడానికి జంకుతున్నారు. వ్యవసాయ, వివిధ పనులకు వెళ్లే కూలీలు 11 గంటలకల్లా ఎండ తీవ్రత తట్టుకోలేక ఇంటిముఖం పడుతున్నారు.

తాడేపల్లిలో వాహనాల చోరీ

నిందితులు అద్దంకి వాసులుగా గుర్తింపు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి రన్నింగ్ రూమ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో కొంతమంది యువకులు అర్ధరాత్రి రోడ్డు పక్కనే ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ కొత్త ఎన్‌ఫీల్డ్ వాహనాలను గుర్తించి వాటిని చోరీ చేస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలో ఆరు వాహనాలు చోరీకి గురయ్యాయి. ఇవి అద్దంకిలో ఉన్నట్లు వాటి యజమానులు గుర్తించారు. అక్కడ పలు ప్రాంతాల్లో అద్దంకి పోలీసులు ఆదివారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ఎన్‌ఫీల్డ్ చోరీ చేసినట్లు గుర్తించారు. అక్కడి పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. ఉండవల్లికి చెందిన యువకులు అద్దంకి పోలీసులను కలిసి తమ వాహనాలుగా గుర్తించారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలను కూడా ఈ గ్యాంగే చోరీ చేసినట్లుగా అద్దంకి పోలీసులు అనుమానిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు కూడా ఈ దొంగలపై దృష్టి సారిస్తే భారీగా దొంగిలించబడ్డ ద్విచక్ర వాహనాలు రికరీ అవుతాయని వాహన చోదకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిద్రమత్తు మిగిల్చిన తీరని శోకం

- పి.గుడిపాడు వద్ద హైవే లారీని ఢీకొట్టిన కారు
- ఆరేళ్ల చిన్నారి మృతి, నలుగురికి గాయాలు



ప్రమాద స్థలిలో మేదరమెట్ల ఎస్సై చంద్రశేఖర్, రోడ్డుపై చిన్నారి

మేదరమెట్ల: ఉగాది పండక్కి సంతోషంగా సొంతూరికెళ్తున్న ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సుదూరం నుంచి కారు డ్రైవింగ్ చేస్తున్న ఆ తండ్రి నిద్రమత్తులో చిన్న కునికిపాటు వేయడంతో తీరని శోకమే మిగిలింది. తన ఆరేళ్ల గారాల పట్టీని కోల్పోవాల్సి వచ్చింది. రోడ్డు ప్రమాదంలో ఆ కుటుంబం మొత్తం ఆసుపత్రి పాలయ్యింది. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా రైల్వే కోడూరుకు చెందిన శివసుందర్ కుటుంబం శ్రీకాకుళంలో గత మూడేళ్లుగా వ్యాపారం చేస్తూ అక్కడే నివాసం ఉంటోంది. ఉగాది పండగ సందర్భంగా స్వస్థలం రైల్వేకోడూరుకు కారులో భార్య సంగతిక, తల్లి నాగేశ్వరమ్మ, పిల్లలు శేషవిన్, ధార్విక(6)తో శివసుందర్ బయలుదేరాడు. పి.గుడిపాడు జాతీయ రహదారి వద్దకు రాగానే డ్రైవింగ్ చేస్తున్న శివసుందర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. అనంతరం ఎదురుగా వస్తున్న లారీ మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో చిన్నారి ధార్విక అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం క్షతగాత్రులను హైవే అంబులెన్సులో ఒంగోలులోని సంఘమిత్ర ఆసుపత్రికి తరలించారు. కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. మేదరమెట్ల ఎస్సై చంద్రశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న పొలంలో మహిళ మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకష్ణ, ఎస్ఐ రవీంద్రరెడ్డి

కొల్లూరు : మొక్కజొన్న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన మహిళా రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చిలుమూరుకు చెందిన వాగోలు చిన్నమ్మాయి(50) ముప్పై ఏళ్లుగా తన భర్తకు దూరంగా ఉంటూ, తనకున్న సొసైటీ భూమి 10 సెంట్లను సాగుచేసుకుంటూ, వ్యవసాయ కూలి పనులకు వెళ్తోంది. ఉదయం మొక్కజొన్న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన చిన్నమ్మాయి సాయంత్రమవుతున్నా... ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె మేనల్లుడు పొలానికి అన్నం తీసుకెళ్లాడు. అదే సమయంలో పక్క పొలానికి చెందిన రైతు.. పొలంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చిన్నమ్మాయి పడిపోయి ఉందని అతనికి చెప్పాడు. ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. మృతురాలి వీపు భాగం, కుడి భుజంపై కాలిన గుర్తులు ఉండి, చర్మం ఊడిపోయి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై ఉంటుందని తొలుత భావించారు. ఆమె మృతదేహాన్ని నిశితంగా పోలీసులు పరిశీలించగా.. మెడ చుట్టూ పైట కొంగు బిగుతుగా బిగించి మెలితిప్పి ఉండటం, కుడివైపు నుదిటిపై గాయం ఉండటం గమనించారు. వేమూరు సీఐ రామకృష్ణ, కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి అనుమానాస్పద మృతిగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కుమార్తె మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేయనున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

ధన రాజకీయాలు టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: నైతిక విలువలను విస్మరించి, ధన రాజకీయాలతో ప్రలోభాలకు గురిచేయడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్యని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. రేపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో అధినాయకుడి నుంచి దిగువస్థాయి నాయకుల వరకు నైతిక విలువలను తుంగలో తొక్కి, గోబెల్ ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ రేపల్లె ఇన్‌చార్జి ధన రాజకీయాలు చేస్తూ.. తమ పార్టీకే చెందిన వారికి మళ్లీ టీడీపీ కండువాలు కప్పడం హాస్యాస్పదమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లబ్ధి పొందేందుకు టీడీపీ నుంచి తమ పార్టీలోకి వలసొచ్చిన నేతలే తిరిగి వెళ్లిపోతున్నారని స్పష్టం చేశారు. వారికే టీడీపీ కండువాలు కప్పి, ఆ పార్టీలోకి కొత్తవారు వచ్చినట్లు ప్రచారం చేసుకోవడం ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. సిసలైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమిస్తారని మోపిదేవి స్పష్టం చేశారు. శక్తి వంచన లేకుండా పార్టీకి కోసం పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యమిస్తారని చెప్పారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు నగదుతో ప్రలోభాలకు గురిచేసే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్ బాధ్యతలు చేపడతారని, రేపల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయటం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్, బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: ఇద్దరు మృతి

పరారీలో లారీ డ్రైవర్



లారీ కింద మోటార్ సైకిల్



రాయల వెంకటేశ్వర్లు



మొండితోక బాలశౌరి

రొంపిచర్ల : మండలంలోని అన్నవరప్పాడు గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అద్దంకి వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వేగంగా వెళ్తున్న లారీ మోటారు బైక్‌ను ఢీకొట్టడంతో ఈపూరు మండలం గోపువారిపాలెం గ్రామానికి చెందిన పాస్టర్ మొండితోక బాలశౌరి(53) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన రాయల వెంకటేశ్వర్లు(75)లు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతులు గోపువారిపాలెం నుంచి మోటార్ బైక్‌పై తురిమెళ్ల గ్రామంలో ప్రార్థనలు నిర్వహించేందుకు వచ్చారు. అక్కడ ముగించుకొని ప్రకాశం జిల్లా సంతమాగులూరు అడ్డరోడ్డు గ్రామంలో ప్రార్థనలో పాల్గొనేందుకు బైక్‌పై బయలు దేరారు. అన్నవరప్పాడు గ్రామం సమీపంలోని బ్రిడ్జి దిగువ భాగంలో యూటర్న్ తీసుకుంటుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. మృతదేహాలను పంచనామ నిర్వహించేందుకు నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు బాలశౌరి కుమారుడు బాబూరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
సోమవారం ॥ 8-4-2024

మంచిమాట

తానెంతో జగమంత



ప్రతిమనిషి, సరిగా చెప్పాలంటే ప్రతి జీవి ప్రపంచం అంతా తన వంటిదనే అనుకుంటుంది. తన దృష్టికోణం లోనే చూస్తుంది. అందుకే అబద్ధాలాడేవారికి అందరూ అబద్ధాలు చెపుతారనే అభిప్రాయమే ఉంటుంది. ఎవరి మాటనీ ఒక పట్టాన నమ్మరు. తాను అబద్ధం చెప్పనప్పుడు ఎదుటివారు అబద్ధం చెపుతున్నారేమో అనే అనుమానం ఎందుకు వస్తుంది? పైగా తను చెప్పేది నిజం అని నమ్మమని ఒకటికి పదిసార్లు నొక్కి వక్కాణిస్తూ ఉంటారు. అవతలి వారు నమ్మరేమో ననే సందేహం ఎందుకు వస్తుంది? తాను చెప్పే మాట మీద తనకే నమ్మకం లేదు కనుక.

ఇతరులని మోసం చేసే గుణం ఉన్న వారు ఇతరులు తమని మోసం చేస్తారేమో నని భయపడుతూనే ఉంటారు. మోసం చేసే బుద్ధి తనకి లేక పోతే ఎదుటి వారు తనని మోసం చేస్తారేమో ననే అనుమానం కూడా రాదు. పరాయి ఆడపిల్లలని చెడుదృష్టితో చూసేవారు తమ ఇంటి ఆడవారిని బయటకు పంపటానికి ఇష్టపడరు. దీనికి పెద్ద ఉదాహరణ రావణుడే. కనపడిన ప్రతి స్త్రీని కామదృష్టితో చూసి, చేజిక్కించుకోవాలనుకునే గుణం ఉన్నవాడు కనుక తన భార్యలని కట్టడిలో ఉంచాడు. మేలిముసుగు లేకుండా వారిని బయటికి రానిచ్చేవాడు కాదు. ఆ విషయాన్ని రావణ వధానంతరం యుద్ధభూమిలో పడి ఉన్న రావణుణ్ణి చూసి మండోదరి ''మేలిముసుగు లేకుండా నీ భార్యల మైన మేము ఇక్కడికి వస్తే ఏమి అనటం లేదేమి?'' అని ప్రశ్నించటంలో తెలుస్తుంది. అదే రావణుడు తన చెల్లెలు శూర్పణఖ విషయంలో అవేవీ పాటించ నక్కర లేదని చెప్పి స్వేచ్ఛగా వదిలేశాడు. రాక్షసవంశంలోనే పుట్టిన ప్రహ్లాదుణ్ణి ''కన్నుదోయి కన్యకాంత లడ్డం బైన మాతృభావము చేసి మరలువాడు'' అని పోతనామాత్యుల వారు వర్ణించారు. స్త్రీల పట్ల సద్భావం కలవాడు కనుక తన తల్లిని, ఇతర స్త్రీలని కూడా గౌరవభావంతో చూడటం తటస్థించింది.



జంతువులన్నీ ఇతర జంతువులు, ముఖ్యంగా మనుషుల మీద దాడి చేయటానికి కారణం వాటికి ఉన్న అభద్రతా భావం. అవి ఎదుటి జంతువులని తినటమో, బాధించటమో చేస్తాయి కనుక ఎదుటి జంతువులు కూడా తమని బాధిస్తాయేమోనని ఎదురు దాడి చేస్తాయి. నాగుపాముని చూస్తే ఈ విషయం బాగా అర్థమౌతుంది. మంచి జాతి సర్పం ఎదురు పడగానే మనిషి భయపడితే అది కూడా భయ పడుతుంది. దాని వంక ప్రేమగా, లేక భక్తితో చూస్తే అది కూడా అదే భావంతో చూసి తొలగిపోతుంది. అందుకే త్రాచు పాము కనపడగానే చేతులు జోడించి నమస్కారం చేసి కదల కుండా ఉండమని చెపుతారు. తేలుకి ఎదుటి ప్రాణి తనని బాధిస్తుందనే సందేహం ఉంటుంది కనుక ఏది అడ్డు తగిలితే దానిని కుట్టుకుంటూ పోతుంది. ఇటువంటి లక్షణాలే మనుషులలో కూడా కనిపిస్తాయి. అకారణంగా ఇతరులని బాధించేవారు, భయం వల్లనే బాధిస్తారు. పచ్చకామెర్ల రోగికి లోకం అంతా పచ్చగా కనిపిస్తుంది కదా!

అదేవిధంగా ''ఆత్మవత్ సర్వభూతాని'' అని భావించి ఎదుటివారి కష్టం తనది భావించి తదనుగుణంగా స్పందించేవారు, ఎవరికి మేలు కలిగినా తమకే కలిగి నంతగా సంతోషించేవారు ఉన్నారు. ఎవరికి ఆపద కలిగినా వీరి కళ్ళలో నీళ్ళు వస్తాయి. ఎవరికి మంచి జరిగినా వీరు పండగ చేసుకుంటారు. అంటే, ఈ కోవకి చెందిన వారు జంతు ప్రవృత్తి నుండి కొంత ఎదిగినట్టు చెప్ప వచ్చు.

ఈ విధంగా ఉండి అందరు తన లాగానే ఉంటారు అనుకోవటం వల్ల లౌకికంగా నష్టపోయిన వారూ ఉన్నారు. కాని, మానవతా దృక్పథంలో వారు ఉన్నత స్థానానికి చేరుకున్నారని అర్థం. ప్రతిస్పందన కన్న సహ అనుభూతి ఉత్తమ స్థాయి.

– ఎన్. అనంతలక్ష్మి

తాత్త్వికథ

చెట్టునీడ



ఒకరోజు జ్ఞాని దగ్గరకు కోటీశ్వరుడు వెళ్లి స్వామి నా దగ్గర కోటానుకోట్ల డబ్బు ఉన్నది. పూర్తి ఆరోగ్యవంతుడిని. ఇక నేను ఎవరిపైనా ఆధారపడవల్సిన అవసరం లేదు. ఎవరినీ సహాయం చేయమని అర్థించాల్సిన అవసరం లేదని చాలా గొప్పగా చెప్పుకున్నాడు.

ఆ మాటలు విన్నాక జ్ఞాని నవ్వుతూ ''బాబు నాతో కాస్త దూరం నడవగలవా'' అని అడిగాడు. అయన ఆలా అడగడంతో నిరాకరించడం బాగుండదని తల చిన ఆ వ్యక్తి జ్ఞానితో కలిసి అడుగులు వేశాడు.

అలా నడుస్తూ నడుస్తూ అలసిపోయిన వ్యక్తి దరిదాపులలో ఏదైనా చెట్టు కనిపిస్తుందేమో... ఆ చెట్టు నీడలో కాసేపు సేద తీరాలని చుట్టూ చూసాడు. ఎక్కడా ఏ చెట్టూ కనిపించలేదు.

ఇది గమనించిన జ్ఞాని ''ఏంటి బాబూ... వెతుకుతున్నావు?'' అని అడిగాడు.

''అయ్యా చాల దూరం వచ్చాము. కాసేపు చెట్టునీడలోకి వెళ్లి సేదతీర్చుకుని ఆ తర్వాత తిరిగి ముందుకు సాగుదాం''అని చెప్పాడు.

అతడి మాటలకు ఆ జ్ఞాని ''చెట్టునీడ నీకెందుకు బాబూ... నీ నీడలో నువ్వు సేద తీర్చుకో'' అన్నాడు.

''నా నీడలో నేను ఎలా ఉండగలను స్వామీ! ఏం మాట్లాడుతున్నారు మీరు?'' అని కాస్తంత ఆశ్చర్యంగా మరి కాస్త నిష్ఠురంగానూ అడిగాడు ఆ వ్యక్తి.

అందుకు ఆ జ్ఞాని, చిరునవ్వుతో అతడి వైపు చూస్తూ... అదేంటి, నీ నీడలో నువ్వు తల దాచుకోలేవా? నువ్వే కదా బాబూ, నాదగ్గర అన్నీ ఉన్నాయి. నేను ఎవరిని ఆశ్రయించాల్సిన అవసరం లేదు అన్నావు, చూశావా! ఇప్పుడు నీ నీడ సైతం నీకు ఉపయోగపడలేదు'' అన్నారు.


ఇప్పుడు ఆ ఐశ్వర్యవంతుడికి నిజంగా జ్ఞానోదయం అయింది ఏ చెట్టు కిందకూ వెళ్లకుండానే.

అందుకే పెద్దలన్నారు... అహంకరించవద్దు అని. ఎంత ధనవంతులైనా, వారికి ఎన్ని ఉన్నా ఎప్పుడు ఎవరికీ ఏది అవసరం అవుతుందో తెలియదు ఈ లోకంలో.

అన్నింటికీ మించి మనపైన మనకు నమ్మకం ఉండాలి అహం ఉండకూడదు. మన పైన మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. అతేకానీ, ఇతరులపైన ఏమాత్రం చులకన భావం ఉండకూడదు... మనసులోకి రాకూడదు.

గృహస్థాశ్రమ విశిష్టత

పెళ్ళి... ఇద్దరి మధ్య వ్యవహారం కాదు



కోటలో యుద్ధం చేయడం గృహస్థాశ్రమం. కోట బయట చేసేవి ఇతర ఆశ్రమాలు. అవి జన్మతః వైరాగ్యం కలిగిన మహాపురుషులకే సాధ్యం. ఎన్నో జన్మల అనుష్ఠాన బలం వారిది. వారు కారణజన్ములు. చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు, చంద్రశేఖర భారతీ మహాస్వామివారు, ఒక రామకృష్ణ పరమహంస, ఒక వివేకానందుడు, అరుణాచల భగవాన్ రమణులు... ఇటువంటివారు ఎక్కడో కోట్లలో ఒకరుంటారు.

కానీ అందరికి అందుబాటులో ఉండేది, అర్థకామములను ధర్మం తో ముడివేసుకోవడానికి యోగ్యమైనది – గృహస్థాశ్రమం. దీని ప్రవేశం... కేవలం ఒక పురుషుడికో, ఒక స్త్రీకో సంబంధించినది కాదు. అంటే పెళ్ళి ఎప్పుడూ పూర్తిగా వ్యక్తిగత విషయం కానే కాదు. ఇక్కడ సక్రమంగా ప్రవర్తించకపోతే... దాని చెడు ప్రభావం సమాజం మీద పడుతుంది. కచ్చితంగా మూడవ వ్యక్తి మీద అది ప్రభావం చూపి తీరుతుంది. అదే దంపతులిద్దరూ అన్యోన్యంగా బతకగలిగితే... మూడవ వ్యక్తికి ఆదర్శంగా నిలుస్తారేమో గానీ, సమాజాన్ని అది చెడుగా ప్రభావితం చేసే అవకాశమేలేదు.

వాళ్ళిద్దరూ పుట్టుకనుంచి కలిసి ఉన్నవారు కాదు, కలిసి చదువుకోలేదు, కలిసి బతకలేదు. ఆకస్మాత్తుగా ఇద్దరు కలుసుకుని జీవిత ప్రయాణానికి, ఒక ఆశ్రమ నియమానికి కట్టుబడటానికి సిద్ధమవుతున్నారు. మనం ఒక ఉద్యోగంలో చేరితేనే... సవాలక్ష నియమాలకు అంగీకరించినప్పుడే దానిలో కొనసాగగలం. అటువంటిది ఒక జీవితకాలం పూర్తిగా కలిసి ఇద్దరూ ప్రయాణించాలి. పుట్టిన సంతానానికి మార్గదర్శకంగా నిలవాలి... అంటే దానికి ఎంతో పరిణతి ఉండాలి. జీవితం అంటే పూలపడవ కాదు కదా... వెలుతురు, చీకటి, కష్టాలు, సుఖాలు... అన్నింటినీ చక్కగా సమన్వయంతో, అవగాహనతో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా వంశాభివృద్ధి చేసుకుంటూ సంసారనావను నడపాల్సి ఉంటుంది. అటువంటి సంసారంలో మంచి జరిగినా, చెడు జరిగినా అది సమాజాన్ని సానుకూలంగా కానీ, ప్రతికూలంగా కానీ ప్రభావితం చేస్తుంటుంది. అందుకే పెళ్ళి ఎప్పుడూ ఇద్దరి మధ్య వ్యవహారం కాదు.

ధర్మం, కామం, అర్థం సమంగా ఉంటే... మోక్షం అనేది కొత్తగా ప్రయత్నించి తెచ్చుకోనక్కర లేదు. అదే వస్తుంది. అంటే ధర్మబద్ధమైన అర్థం, ధర్మబద్ధమైన కామం ఉండాలి. నేను డబ్బు సంపాదిస్తే ధార్మికంగా సంపాదించానా ? ఖర్చుపెడితే.. ధర్మంకోసం ఖర్చు పెట్టానా? నాకు మనసులో ఒక కోరిక పుడితే ఇది ధర్మచట్రంలో ఇముడుతుందా? దీనిని నేను నెరవేర్చుకోవచ్చా? ... ఈ పరిశీలన అలవాటయితే అర్థం. కామం ధర్మానికి ముడిపడిపోయినట్టే. సామాన్యులకు కూడా ప్రయోజనం చేకూరాలని మన రుషులు ప్రవేశపెట్టిన మార్గం ఇది.. అదే గృహస్థాశ్రమం.

గృహస్థు అంటే కేవలం ఒక గృహంలో ఉన్నవాడని కాదు. గృహస్థాశ్రమ స్వీకారం చేశాడు... అంటే ధర్మాన్ని స్వీకరించాడు.. అని. తరువాత నిత్యకర్మ చేయకుండా ఎలా ఉంటాడు? అది సాధ్యం కాదు. ఏదో కర్మ చేయవలసిందే. దీనివల్ల చివరకు ప్రత్యేకంగా ప్రయత్నించకపోయినా మోక్షమే కలుగుతుంది. జ్ఞానాన్ని ఇచ్చిన భగవంతుడు మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు.

రామాయణంలో భరతుడు ఒక మాటంటాడు. నాలుగు ఆశ్రమాలలోకి గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనది –అని. అంతకన్నా గొప్పది మరొకటి లేదు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

వార్‌కు రెడీ!



• ఎన్టీఆర్

బాలీవుడ్ 'వార్'కు రెడీ అవుతున్నారు ఎన్టీఆర్. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. 2019లో హిట్‌గా నిలిచిన హిందీ చిత్రం 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. 'వార్'కి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించగా, 'వార్ 2'కు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఇప్పటికే 'వార్ 2' చిత్రీకరణ మొదలైందని, హృతిక్‌రోషన్ పాల్గొనగా కొంత చిత్రీకరణ కూడా జరిపారని టాక్. కాగా ఈ వారంలో 'వార్ 2' సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అవుతారని బాలీవుడ్ సమాచారం. ఎన్టీఆర్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపిస్తారని టాక్. 'వైఆర్ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. 'వార్ 2' చిత్రాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లుగా ఇప్పటికే చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

చలో రాజమహేంద్రవరం



• రామ్‌చరణ్

'గేమ్‌చేంజర్' కోసం రాజమహేంద్రవరం వెళ్లనున్నారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, నవీన్‌చంద్ర, ప్రియదర్శి, జయరాం, సునీల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ రాజమహేంద్రవరంలో జరగనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. రామ్‌చరణ్‌తో పాటు ముఖ్యతారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ ఈ నెలాఖరులో ప్రారంభం కానుందని తెలిసింది. కథ రీత్యా సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట శంకర్. రాజమహేంద్రవరం షెడ్యూల్ పూర్తయిన తర్వాత వైజాగ్‌కు వెళ్తారట యూనిట్. తమన్ ఈ సినిమాకు స్వరకర్త. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.. రిలీజ్ డేట్‌పై త్వరలోనే స్పష్టత రానుంది.


అక్టోబర్‌లో వేట్టయాన్



• రజనీకాంత్

అక్టోబర్‌లో థియేటర్స్‌కు వస్తున్నాడు 'వేట్టయాన్'. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ 'వేట్టయాన్'. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్, జీకేఎమ్ తమిళ కుమరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబరులో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రజనీకాంత్ ఓ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, కిషోర్, రితికా సింగ్, దుషార విజయన్ ఇతర పాత్రల్లో నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీత దర్శకుడు.

పవర్‌ఫుల్ పాత్రలో...



• జగపతి బాబు

రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అన్నది ట్యాగ్‌లైన్. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్న జగపతిబాబు లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. చెస్ మూవ్‌ని చేతిలో పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న లుక్ బాగుంది. ''మిస్టర్ బచ్చన్'లో జగపతి బాబు పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. రవితేజ, జగపతిబాబులను తెరపై చూడటం కనుల పండువగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ సిరీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: అయనంక బోస్.

పెళ్లి పేరుతో మోసం చేశాడు

– సన్నీలియోన్



'ఓ వ్యక్తి ప్రేమ, పెళ్లి పేరుతో నన్ను మోసం చేశాడు' అన్నారు బాలీవుడ్ నటి సన్నీలియోన్. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మరాఠి, బెంగాలి, మలయాళ భాషల్లోని పలు చిత్రాల్లో ప్రత్యేక పాటలతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు ఈ బ్యూటీ. 'కరెంట్ తీగ (2014) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన సన్నీలియోన్ 'పీఎస్‌వీ గరుడవేగ', 'జిన్నా' వంటి సినిమాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె 'రంగీలా', 'వీరమదేవి', 'కొటేషన్ గ్యాంగ్', 'షీరో', 'కోకా కోలా', 'యువ' వంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. అదేవిధంగా 'స్ప్లిట్స్ విల్లా' అనే ఓ రియాలిటీ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు సన్నీ. తాజాగా ఈ షోలో ఆమె మాట్లాడుతూ–''కొన్నేళ్ల క్రితం ఒక వ్యక్తిని చాలా ప్రేమించాను. తన కూడా నన్ను ప్రేమించాడు. మా ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. ఆ తర్వాత ఏదో తప్పు జరుగుతోందని, అతడు నన్ను మోసం చేస్తున్నాడేమోనని నా మనసుకు అనిపించింది. దీంతో 'నువ్వు నన్ను ఇంకా ప్రేమిస్తున్నావా?' అని ప్రశ్నిస్తే లేదన్నాడు. మరో రెండు నెలల్లో మా పెళ్లిని ప్లాన్ చేసుకున్నాం. హవాయి దీవుల్లో గ్రాండ్‌గా, జీవితాంతం గుర్తుండిపోయేలా వివాహం జరగాలని ప్లాన్ చేసుకున్నాం. ఇందుకోసం అన్నీ బుక్ చేసుకుని డబ్బులు కూడా ఇచ్చేశాను. పైగా పెళ్లి షాపింగ్ కూడా అయిపోయింది. ఇలాంటి సమయంలో తను అలా చెప్పడంతో నా మనసు ముక్కలైంది.. ఎంతో బాధపడ్డాను. ఆ తర్వాత భగవంతుడు నా జీవితంలో అద్భుతమైన మార్పులు తీసుకువచ్చాడు. డానియల్ వెబర్‌ను పరిచయం చేశాడు. నా తల్లితండ్రులు చనిపోయినప్పుడు తను ఎంతో అండగా నిలిచాడు. మా ఇద్దరి మనసులు కలవడంతో పెళ్లి(2011) చేసుకున్నాం. ఎప్పటికీ నా భర్త చేయి వదలను'' అన్నారు.

అది రహస్యం కాదు!



• అదితీరావ్, సిద్ధార్థ్

''నేను, అదితీరావ్ హైదరీ కలిసి రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నామని చాలామంది అంటున్నారు. సీక్రెట్, ప్రైవేట్ అనే పదాలకు ఎంతో తేడా ఉంది. ఎవర్నీ పిలవకుండా, ఎవరికీ చెప్పకుండా చేసుకుంటే అది సీక్రెట్ అవుతుంది. కానీ, మా ఇరు కుటుంబసభ్యులతో కలిసి మేము ప్రైవేట్ ఫంక్షన్ చేసుకున్నాం. మా వారి సమక్షంలో జరిగిన నిశ్చితార్థం సీక్రెట్ ఎలా అవుతుంది'' అన్నారు హీరో సిద్ధార్థ్. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీ మార్చి 17న వనపర్తి జిల్లాలోని శ్రీరంగపురంలోని ఆలయంలో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ వేడుకలో పాల్గొన్న సిద్ధార్థ్‌కి నిశ్చితార్థం ఎందుకు రహస్యంగా చేసుకున్నారు? పెళ్లెప్పుడు? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనికి సిద్ధార్థ్ స్పందిస్తూ– ''నా ప్రేమ విషయాన్ని తొలిసారి అదితీరావుకి చెప్పినప్పుడు తన నుంచి ఏం జవాబు వస్తుందా? అని ఎదురుచూశాను. కానీ, తను నా ప్రేమను అంగీకరించడంతో చాలా సంతోషపడ్డాను. ఇక మా పెళ్లి ముహూర్తం నా చేతుల్లో లేదు.. మా ఇరుకుటుంబ పెద్దలు నిర్ణయిస్తారు'' అన్నారు సిద్ధార్థ్.

ఎమోషనల్ థ్రిల్లర్



• వరలక్ష్మి

విలక్షణ నటి వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'శబరి'. ఈ మూవీ ద్వారా అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయవుతున్నారు. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో నిర్మించారు. ఈ సినిమాని మే 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ–''స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రమిది. కథ, కథనాలు ఇన్నోవేటివ్‌గా ఉంటాయి. వరలక్ష్మి నటించిన గత సినిమాలకు పూర్తి భిన్నంగా 'శబరి' ఉంటుంది. ముఖ్యంగా ఆమె నటన వావ్ అనేలా ఉంటుంది. తెలుగు, తమిళ వెర్షన్స్ ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. అన్ని భాషల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడి శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: గోపీ సుందర్.

రైతు గంగమ్మ



• పార్వతి

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. పా. రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కాగా ఆదివారం(ఏప్రిల్ 7) పార్వతీ తిరువోతు బర్త్ డే. ఈ సందర్భంగా 'తంగలాన్' లో ఆమె నటించిన గంగమ్మ పాత్ర ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. లుక్ చూస్తే మహిళా రైతు పాత్రలో ఆమె నటించినట్లు తెలుస్తోంది. ''కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనలతో 'తంగలాన్' రూపొందింది. విక్రమ్‌ని విభిన్నమైన క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు పా.రంజిత్. త్వరలోనే ఈ సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.